నిలిచిన శస్త్రచికిత్సలు.. పెరిగిన శునకాలు

- కుక్కల శస్త్ర చికిత్సాలయంలో ఆగిపోయిన ఆపరేషన్లు
- పట్టణంలో శునకాల స్వైర విహారం
- నిరుపయోగంగా మారిన భవనం


పట్టణంలో తిరుగుతున్న వీధి కుక్కలు


మూతబడిన కంపోస్టు యార్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయం

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్సాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఆపరేషన్ల భవనాన్ని ఈఏడాది ప్రారంభం నుంచి మూసివేసి ఉండటంతో ఆవరణలో వర్షపు నీరు చేరింది. దీంతో పట్టణంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది.

2022లో పునర్నిర్మాణం..

తెనాలి పట్టణ పరిధిలోని వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు 2017లో బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డులో రూ.20 లక్షలతో కుక్కల శస్త్ర చికిత్సాలయంను నిర్మించారు. దీనిలో ఒక షెడ్‌లో కుక్కల సంరక్షణ గదులు, రెండో షెడ్‌లో శస్త్ర చికిత్స గదులను ఏర్పాటు చేశారు. యానిమల్ కేర్ ల్యాండ్ సంస్థ ద్వారా సుమారు 800 శస్త్ర చికిత్సలు చేశారు. షెడ్ కొద్ది సంవత్సరాలకే పడిపోవటంతో శస్త్ర చికిత్సలను నిలిపివేశారు. కుక్కల బెడదపై ఎక్కువగా ఫిర్యాదులు రావటంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అధికారులకు, అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు శస్త్రచికిత్సాలయాన్ని పునర్నిర్మించాలని కోరారు. దీంతో 2022 ఏప్రిల్‌లో దానిని రూ.5 లక్షలతో పునర్నిర్మించి, శస్త్రచికిత్సలు పునఃప్రారంభించారు. శస్త్ర చికిత్సలు చేసేందుకు ముగ్గురు పశు వైద్యులను కూడా నియమించారు. వారంలో రెండు రోజులు వాటికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

శస్త్ర చికిత్స చేసే విధానం ఇది..

మున్సిపల్ అధికారుల సూచన మేరకు వీధి కుక్కలను వలల ద్వారా పట్టుకుంటారు. అక్కడే కుక్కకు జియో ట్యాగ్‌ను వేసి ఆన్‌లైన్‌లో దాని ఫొటోను అప్‌లోడ్ చేస్తారు. అనంతరం దానిని వ్యాన్‌లో చికిత్సాలయానికి తరలించి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసి రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచుతారు. తరువాత దానిని ఎక్కడ పట్టుకున్నారో అక్కడే వాటిని వదిలి వేస్తారు.

రెండో విడతలో 650 కుక్కల గుర్తింపు..

తెనాలిలో శస్త్ర చికిత్సాలయం ఏర్పాటు చేసిన తర్వాత మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో మున్సిపల్ అధికారులు వీధి కుక్కల వివరాలు సేకరించారు. మొదటి విడత కింద 775 కుక్కలున్నట్లు గుర్తించారు. వాటిలో 772 కుక్కలకు అప్పట్లో శస్త్ర చికిత్సలు చేశారు. ఇటీవల రెండో విడత చేసిన సర్వేలు మరో 650 వీధి కుక్కలున్నట్లు నిర్ధారణ అయింది. వాటికి శస్త్ర చికిత్సలు చేసేందుకు మున్సిపల్ అధికారులు ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్‌లో అనుమతులు తీసుకున్నారు. ప్రస్తుతం ఆవరణలోని వర్షపు నీటిని మోటర్లతో తోడిస్తున్నారు. ఆ పనులు పూర్తి కాగానే వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. మొత్తంమీద ఆరు నెలల తర్వాత మళ్లీ వీధి కుక్కలకు సంతానోత్పత్తి నివారణ ఆపరేషన్లు చేయనున్నారు.

త్వరలో పునఃప్రారంభిస్తాం..



తెనాలి పట్టణంలోని వీధి కుక్కల సమస్యను తొలగించేందుకు శస్త్ర చికిత్సాలయంను ఏర్పాటు చేశారు. అక్కడ వాటికి సంతానోత్పత్తిని నియంత్రించే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. ఇలా చేయటం వల్ల కుక్కలు తగ్గి ఇబ్బందులు తొలిగే అవకాశం ఉంది. ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా అధికారులు నిలిపివేశారు. త్వరలో శస్త్ర చికిత్సలు పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెనాలిలో ఇంకా ఎక్కడైనా కుక్కల సమస్య ఉంటే వెంటనే మాకు తెలియజేయండి. వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఆరోగ్యాధికారిణి, తెనాలి పురపాలక సంఘం

చిరుజల్లులతో కూడిన వర్షం

పట్టణంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం


కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావం కారణంగా తెనాలి పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం మొదలై బుధవారం రాత్రి వరకు కురుస్తునే ఉంది. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు. బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పట్టణంలోని 1, 34, 39 వార్డులలో పర్యటించారు. వర్షపు నీరు వెంటనే కాల్వలోకి వెళ్లే విధంగా చూడాలన్నారు. అల్పపీడనం ప్రభావం రెండు రోజులు ఉండే అవకాశం ఉండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వర్షం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే ఉద్యోగులందరూ స్పందించాలని తెలిపారు. ఆయన వెంట పలువురు ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

డివిజన్ స్థాయి అవగాహన సదస్సులో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి: బాల్య వివాహాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషిజరగాల్సి ఉందని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటూనే, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు, పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తెనాలి డివిజన్, మండల స్థాయిలో బాల్య వివాహ నిరోధక చట్టం–2023పై స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అవగాహన సదస్సును నిర్వహించారు. గుంటూరు జిల్లా మహిళా శిశు అభివృద్ధి ఏజెన్సీ సహకారంతో ఏర్పాటైన సమావేశానికి మంగళగిరి సీడీపీఓ ఎ.సులోచన అధ్యక్షత వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలను నిర్మూలించే విషయంలో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు అందరికీ బాధ్యత ఉంటుందని చెప్పారు. జిల్లా శిశు రక్షణ అధికారి సీహెచ్ విజయకుమార్ మాట్లాడుతూ, చిన్న వయసులో వివాహాల నిర్మూలన చట్టం–2023 గురించి అవగాహన కల్పించారు. లీగల్/ప్రొబేషన్ అధికారి బి.వాసంతి మాట్లాడుతూ తప్పనిసరి వివాహ నమోదు చట్టం–2022, అలాగే నియమాలు–2023 గురించి వివరించారు సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త కె.సమీర్‌కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులకు రక్షణ కల్పించే విధానంలో సీడీపీఓల పాత్రను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ నిర్మల, చిన్న వయసులోనే జరిపించే వివాహాలను అరికట్టటంలో తమ సహకారం ఉంటుందని తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, తెనాలి ఎంపీడీవో శిల్ప తెలియజేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే బాల్య వివాహాలను అరికట్టటం సాధ్యపడుతుందని బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ నిర్మల, తెనాలి, పొన్నూరు సీడీపీఓలు డాక్టర్ ఎం.సునీత, ఎస్.వెంకటరమణ, తెనాలి రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, శిశుసంక్షేమ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం



తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు – కూచిపూడి రోడ్డులో జీవీ కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన మధుర నగరిలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం సభ్యుడు, సామాజిక సేవకుడు గుమ్మడి వెంకట నారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి నిర్వహించారు. పలువురు పట్టణ ప్రముఖులు, జీవీ నారాయణ సన్నిహితులు, మిత్రులు, రోటరీ సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన గుమ్మడి వెంకటనారాయణ, మాధవి దంపతుల చేతుల మీదుగా పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. క్లబ్ బాధ్యుడు ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు, ఆదినారాయణ, గుత్తా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి జయంతి మహోత్సవం



తెనాలి: పట్టణంలోని శరణాగతి గోష్టి పీఠంలో నరేంద్ర రామానుజ దాస స్వామీజీ ఆధ్వర్యంలో బుధవారం గోదాదేవి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి విశేషంగా పూజలు నిర్వహించారు. నూట ఒక్క నైవేద్యాలు, తిరుప్పావై సేవింపు సమర్పణ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర రామానుజదాస స్వామీజీ అనుగ్రహ భాషణ చేశారు. గోదాదేవి విష్ణుమూర్తిపై అపారమైన భక్తితో విష్ణుమూర్తినే భర్తగా పొంది విష్ణు సన్నిధి చేరిందని అన్నారు. ఆమె అనుగ్రహంతో భక్తులకు సకల శుభాలు కలుగుతాయని తెలియజేశారు. అనంతరం భక్తులకు తదియారాధన కార్యక్రమం నిర్వహించారు. తన్నీరు సీతారామాంజనేయులు, నాగేంద్రయ్య, పూసలపు శివయ్య మాస్టారు, విష్ణుమొలకల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలి: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీశివ లింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి శిబిరం వద్ద బుధవారం వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన షేక్ సైదాబీ 3వ వర్ధంతి సందర్భంగా కుమారులు షేక్ కమాల్ వలి, షేక్ కాలేషా వలి,షేక్ మీరావలి ఆర్థిక వితరణతో ఈ సేవను నిర్వహించారు. సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. సైదాబీ కుటుంబసభ్యులు, సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, చిన్నబాజి, కొలకలూరి శ్రీను, నాగరాజు, మునిపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ప్రోత్సహించండి



తెనాలిఅర్బన్: చేనేత పరిశ్రమను ప్రోత్సాహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెఎంజె కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని జెఎంజె కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1905 ఆగస్టు 7వ తేదీన ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం తారస్థాయికి చేరి స్వాతంత్ర్య సముపార్జనకు తోడ్పాటును అందించిందని గుర్తు చేశారు. చేనేత వస్త్రాలను అందరూ ఉపయోగించాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు సిస్టర్ శారద, సిస్టర్ అమూల్ మేరి, పాటిబండ్ల హేమలత, తదితరులు పాల్గొన్నారు.

- స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా బుధవారం జెఎంజె కళాశాలలో దేశభక్తి గీతాల, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.విజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కృష్ణాయపాలెం వద్ద బుధవారం జరిగింది. ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలేనికి చెందిన శ్రీనివాస్ హైకోర్టు ఆవరణలోని క్యాంటీన్‌లో పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై అక్కడకు వెళుతుండగా, కృష్ణాయపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌ను పోలీసులు 108లో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: తెనాలి పట్టణం, మండలంలో ప్రైవేటు పాఠశాలల పిల్లలను తరలించే ఆటోల డ్రైవర్లతో రవాణా శాఖ అధికారులు బుధవారం సమావేశం నిర్వహించారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తిస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమే ఆటోలో ఎక్కించుకోవాలని, డ్రైవర్ వెంబడి, వెనుక డోర్ తెరచి విద్యార్థులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్‌బాక్సులు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడన్నారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలి రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కరపాల చిన్న(45) వ్యవసాయ పనులు చేస్తూంటాడు. కుటుంబ కలహాల కారణంగా గత నెల 27న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదైంది. రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరుకు చెందిన మానసకు చుండూరు మండలం చినపరిమికి చెందిన గోపిరెడ్డితో 2022లో వివాహమైంది. తనను భర్త, అత్త అధిక కట్నం తెమ్మంటూ తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బుధవారం తెలిపారు.

'అవయవ దానంతో మరణించినా జీవించొచ్చు'

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కనున్న నిర్మల ఫార్మసీ కళాశాలలో ఈ నెల 1నుంచి 15వరకు జాతీయ సేవా పథకం, అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ వి. దివ్య తేజోమూర్తి, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ జి. సీతామహాలక్ష్మి, అవయవదాతల సంఘం నుంచి గుంటూరు జీజీహెచ్ డాక్టర్ రమణ యశస్విలు అతిథులుగా హాజరై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ అవయదానం వల్ల మనిషికి పునర్జన్మ లభించినట్లు అవుతుందన్నారు. అవయదానం వల్ల మరణించినా జీవించవచ్చని తెలిపారు. అనంతరం అవయదానంపై నిర్వహించిన పోస్టర్ కాంపిటీషన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొ ని సృజనాత్మకతను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతగా ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు జి. నరసింహారావు వ్యవహరించి, విజేతల్ని ప్రకటించారు. భాగ్యశ్రీకి ప్రథమ, ఎం. భార్గవి ప్రియకు ద్వితీయ స్థానం లభించింది. అనంతరం ముఖ్య అతిథులు, ఉపా..ద్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి అవయదానంపై ప్రతిజ్ఞ చేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రోగ్రాం ఆఫీసర్ రేఖా నరేష్ బాబు, ఆర్. నరసింహ నాయక్ పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత

తెనాలిఅర్బన్: తల్లిపాలను బిడ్డలకు ఇవ్వడం వలన ఆరోగ్యకరంగా ఉంటారని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగింపు సమావేశాన్ని జిల్లా వైద్యశాలలోని తల్లిపిల్లల వైద్యశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డపుట్టిన అరగంట తరువాత పిల్లలకు పాలు ఇవ్వవచ్చని చెప్పారు. తల్లి ఇచ్చే పాలల్లో వ్యాధినిరోధక శక్తి ఉంటుందన్నారు. సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రమణ్య రాజు మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వలన ఎటువంటి ఇబ్బందులు రావన్నారు. కొంత మందిలో అపోహలు ఉన్నాయని వాటిని విడనాడాలని సూచించారు. సమావేశంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఆర్ఎంఓ డాక్టర్ మల్లిఖార్జునరావు, ఏఓ డాక్టర్ మజీద బేగం, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డల్లో వ్యాధి నిరోధకత...

తెనాలి: పుట్టిన బిడ్డకు తల్లిపాలను తప్పనిసరిగా ఇవ్వడమనే అంశానికి విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఐసీడీఎస్, తెనాలి ప్రాజెక్ట్ సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత సూచించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో చివరిరోజైన బుధవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించారు. అధ్యక్షత వహించిన డాక్టర్ ఎం.సునీత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు గంటలోపు పట్టించటం వల్ల, ఆ పాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తాయని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని చెప్పారు. సీడీపీఓలు ఎ.సులోచన (మంగళగిరి), ఎస్.వెంకటరమణ (పొన్నూరు), సుజాత (ప్రత్తిపాడు), ఏసీఈపీఓలు సరిత, విజయకుమారి, డీసీపీఓ సీహెచ్ విజయకుమార్, లీగల్, ప్రొబేషన్ ఆఫీసర్ వాసంతి (గుంటూరు), సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

రక్తహీనత ముక్త్ భారత్ సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న డాక్టర్ శారద, చిత్రంలో సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి: రక్తహీనత ముక్త్ భారత్ (ఏఎంబీ) కార్యక్రమాన్ని తెనాలి ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న సందర్భంగా బుధవారం రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశానుసారం, గత మూడు దశాబ్దాలుగా సమాజసేవలో కొనసాగుతున్న శారద సర్వీస్ సొసైటీ, తెనాలి వ్యవస్థాపకులు డాక్టర్ డి.శారద ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కొలకలూరు పీహెచ్‌సీ, ఇతర పీహెచ్‌సీల్లో గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించటం, తగిన సూచనలు, సలహాలు, ఆరోగ్య నియమాలను తెలియజేసి, రక్తహీనతను తగ్గించుకునేలా చూసేందుకని డాక్టర్ శారదను నియమించారు. గర్భిణుల్లో 45–50 మంది రక్తహీనత సమస్యలతో ఉంటున్నారని, ఈ శాతాన్ని తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం రక్తహీనత ముక్త్ భారత్‌ను ప్రవేశపెట్టారని వివరించారు. తెనాలి ప్రాంతంలో ఈ నెల 9వ తేదీనుంచి ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహిస్తామని తెలియజేశారు. కొలకలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశంలో సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డాక్టర్ డి.శారద, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, పీహెచ్‌సీ ఆరోగ్య అధికాఉలు బి.సుబ్బారావు, డాక్టర్ దిలీప్, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయపడిన ఘటన ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారధిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మలతోటి గోపిచంద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను కళాశాలకు వెళ్లేందుకు బుధవారం ఉదయం మంగళగిరిలోని ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. 10.30 గంటలకు వారధిపై ఉన్న చెక్‌పోస్టు సమీపానికి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో గోపిచంద్ కిందపడిపోవడంతో తలకు గాయమైంది. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

11న ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణస్వీకారం


ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన హరికిషోర్

తెనాలి: గుంటూరు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ యూత్, తెనాలి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఈనెల 11వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. ఈనెల 11వ తేదీన స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరగనున్న ప్రమాణస్వీకారోత్సవ ఆహ్వాన పత్రికను బుధవారం సాయంత్రం వ్యవస్థాపక కార్యదర్శి కొప్పురావూరి హరికిషోర్ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి టీజీ భరత్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు పాల్గొంటారని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారని వివరించారు. పలు సేవాకార్యాక్రమాలను ఇదే సభలో నిర్వహిస్తామని తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నాళం రజనీకుమార్, కర్పూరపు రఘునాథగుప్త, మాలేపాటి నరేష్, కన మర్లపూడి శ్రీనివాస్, డీవీఎల్ గణపతి, బాలశ్రీనివాస్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తెనాలిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. బీజేపీ తెనాలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం తెనాలిలో నిర్వహించారు. దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి అంకితభావంతో పనిచేసి కార్యకర్తలు ఉండటం బీజేపీ అదృష్టమన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కేంద్ర పథకాలు తెలుసుకొని ప్రజలకు వివరించాలని, పింఛన్ పంపిణీలో పాల్గొనాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ విశ్వకర్మ పథకం, ఉచిత బియ్యం, ఎయిమ్స్ హాస్పటల్ గురించి ప్రజలకు చెప్పాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి టి.రామకృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కటారి వసుదేవ నాయుడు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్య నాయుడు, తెనాలి ఇన్‌చార్జి చుండూరు ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, కొల్లిపర మండల అధ్యక్షుడు మునగాల కృష్ణమూర్తి, అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు, టి.రఘు, దారా సాయిగుప్త, రవీంద్ర, నాగరాజ్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు

తాడేపల్లి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని విజయవాడ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు, ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి హెచ్.జి. చక్రధారి ప్రభూజీ విద్యార్థులకు సూచించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ యూనివర్సిటీలో బుధవారం ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల వ్యతిరేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మాదక ద్రవ్యాల ఉచ్చులో చిక్కుకుని నేటి యువత జీవితాన్ని నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు, చక్కని నడవడిక అలవరచుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ మత్తుతో భవిష్యత్ చిత్తు అవుతుందని తెలిపారు. మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని సూచించారు. అనంతరం హెచ్.జి. చక్రధారిని మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ స్టూడెంట్స్ అఫైర్ డాక్టర్ పి. శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త పి. సురేష్ పాల్గొన్నారు.

వైద్యుల సేవలు మరువరానివి


డాక్టర్ రాకేష్‌ను సన్మానిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిఅర్బన్: జిల్లా వైద్యశాలలో పలు విభాగాలకు చెందిన ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్, ఎనాస్తీషియా డాక్టర్ ప్రియాంకల సేవలు మరువరానివని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి కొనియాడారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తూ విధులు నుంచి రిలీవ్ అయిన వైద్యుల అభినందన సభను బుధవారం జిల్లా వైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ కింద వీరంతా పని చేసినట్లు చెప్పారు. దాని పరిధిలో పనిచేసే 32 మంది స్టాఫ్ నర్సులు, ముగ్గురు వైద్యులను విధుల నుంచి ఉన్నతాధికారులు రిలీవ్ చేసినట్లు తెలిపారు. వీరందరూ రోగులకు మంచి వైద్యసేవలు అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి, ఏఈ డాక్టర్ మజీద బేగం, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

తెనాలి బాలాజీరావు పేట డోర్ నెం: 8-7-24కు చెందిన నా క్లయింట్ పేరం సంజీవరెడ్డి ది.29/07/2024వ తేదిన తెనాలిలోని రజక చెరువు వద్దనున్న జిరాక్స్ షాపు నుండి వెళ్తుండగా తన ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్ (ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబరు 3254/1981 మరియు 3613/2005)లు పోయినవి. కావున ఎవరికైన దొరికినచో నా క్లయింటుకుగాని నాకు గాని తెచ్చి ఇవ్వగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

యం.మాణిక్యరావు, అడ్వకేట్ & నోటరి
పేరం సంజీవరెడ్డి – 9966272766